
# పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**గద్వాల టౌన్ జూలై 27, ప్రభాతవార్త:** గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం కోసం గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్నం సెక్షన్ ప్లాటింగ్ పరీక్ష నిర్వహణను ఆదివారం కలెక్టర్ బి.యం. సంతోష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 151 మంది అభ్యర్థులకు గాను, 129 మంది హాజరయ్యారని, 22 మంది గైర్హాజరు అయినట్లు, మధ్యాహ్నపు సెషన్ కు కూడా యధావిధిగా అభ్యర్థులు పరీక్షకు హాజరైనట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహిస్తున్న ప్లాటింగ్ పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తుతో పాటు ఎలాంటి కాపీ జరుగకుండా పరీక్ష ను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ తో పాటు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి. రామచంద్రం, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రేణుకా దేవి, పర్యవేక్షకులు ప్రియాంతదితరులు పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# చిరుతను పట్టుకుంటాం..

- ధైర్యంగా ఉంటాలంటూ కలెక్టర్ బాధితులకు భరోసా
- చిరుత దాడిలో గాయపడ్డవారికి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై27,ప్రభాతవార్త:** చిరుతను పట్టుకోవడానికి ప్రత్యేక కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎవరై అధైర్య పడొద్దని కలెక్టర్ విజయేంద్ర బోయి భరోసానిచ్చారు. మహబూబ్ నగర్ జిల్లా కోయిల్ కొండ మండలం కొత్లాబాద్ గ్రామ శివారు లో శనివారం రాత్రి చిరుత పులి దాడిలో గాయపడి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోచికిత్స పొందుతున్న ముగ్గురిని ఆదివారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరామర్శించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు.గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. గొర్రెల కాపరి గొల్ల మైబన్న గ్రామానికి సమీపంలో శనివారం రాత్రి తన గొర్రెల మందను నిలిపి నిద్రించాడు. అర్ధరాత్రి మందలో అలజడి కనిపించడంతో గొర్రెల కాపరి పక్కనే ఉన్న రైతులు సత్యనారాయణ రెడ్డి, చెన్నారెడ్డి లను పిలిచాడు. అందరూ కలిసి బ్యాటరీ సహాయంతో మందలో పరిశీలించగా చిరుత పులి అప్పటికే నాలుగు గొర్రెలను చంపి వాటి రక్తాన్ని తాగి నిద్రిస్తుంది. ఈ ముగ్గురి మాటలకు చిరుత లేచి వారిపై దాడికి పాల్పడింది. ముగ్గురి కేకలతో గొర్ల అలజడికి చిరుత వెనక్కి తగ్గి గుట్టలోకి వెళ్లిపోయింది. గాయపడ్డ వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే చిరుత సంచరించే ప్రదేశంలో అటవీ అధికారులు బోను ను ఏర్పాటు చేసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

# కేఎల్ఐ కాల్వను పరిశీలించిన ఎమ్మెల్యే



కేఎల్ఐ కాల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

**వెల్దండ, జూలై 27 ప్రభాతవార్త:**మండల పరిధిలోని గుండాల గ్రామ సమీపంలో ఉన్న కేఎల్ఐ డీ-82 కాలువను కాంగ్రెస్ పార్టీ నాయకుల తో కలిసి ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతవారం రోజుల క్రింద కొల్లాపూర్‌దగ్గర కృష్ణానీటిని మంత్రిజూపల్లి కృష్ణారావుతో కలిసి సాగునీ రు ను విడుదలచేయడం జరిగిందని,కాలువల గుండా ఉన్న ముళ్ళ చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అతి త్వరలోనే సాగునీరు మండలానికి చేరుతుందని రైతులసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయ మన్నారు.ఈ కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నంభూపతిరెడ్డి,ఆర్యవైశ్య మహాసభ జిల్లాఅధ్యక్షులు బచ్చు రామకృష్ణ,కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ ఉమా సంజీవ్‌యాదవ్, తాలూకా కిసాన్ సెల్‌అధ్యక్షులు పర్వత్‌రెడ్డి,సింగల్ విండోడైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్,కాంగ్రెస్‌నాయకులు ఎండి అలీ,రషీద్, పుల్లయ్య, శేఖర్, హరికిషన్, అరుణ్‌నాయక్, అంజయ్యతో పాటు రైతులు ఉన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తు మా బాధ్యత..



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

- విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థితిలోకి రాణించాలి...
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహాత్మ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినులు శృతి, మమత, దీపికలను, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డిలతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రిలో పరామర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థినులకు ఉత్తమ వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు మంత్రి ఆదేశించారు. విద్యార్థినిల తల్లిదండ్రులతో మాట్లాడిన మంత్రి, ప్రభుత్వం వారి పిల్లల ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ వహిస్తుందని భరోసా ఇచ్చారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు ఉయ్యాలవాడలో ఉన్న మహాత్మ జ్యోతిబా గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల వంటగది, పరిసరాలను వంట సామాగ్రిని,



విద్యార్థినులను పరామర్శిస్తున్న మంత్రి

ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు గురుకుల పాఠశాలలో విద్యార్థినీలతో మాట్లాడుతూ, విద్యార్థినీలు అసూయ, భయాలు దూరం చేసి భవిష్యత్తుపై దృష్టి సారించాలని, ప్రభుత్వంగా మేము మీతో ఉన్నాము. మీ ఆరోగ్యం, విద్య రెండు మాకెంతో ప్రాధాన్యతైనవి మీరు బలంగా ఉండాలి, చదువులో మెరుగ్గా ఉండాలని విద్యార్థినులకు స్ఫూర్తిదాయక గీతాలను తన చరవాణి ద్వారా వినిపించి ఉత్సాహం కలిగించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో జరిగిన ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం 40 శాతం డైట్ చార్జీలను పెంచి, ఎంతో ఖర్చు చేస్తుందని, స్థానిక సిబ్బంది, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు మెరుగైన భోజన వసతులు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. పరిశుభ్రత వాతావరణంలో వంటలు వండి విద్యార్థులకు మెరుగైన వసతులు నాణ్యమైన భోజనం వసతిని కల్పించాలని మంత్రి అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు వెంట బీసీ గురుకులాల సెక్రటరీ సైదులు, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, డిఎంహెచ్ఓ, స్వరాజ్యలక్ష్మి, డిఇఓ రమేష్ కుమార్, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు

**సహించేది లేదు సస్పెండ్ తప్పదు.**

**-సమన్వయ వైద్యంతో ఆరోగ్యం క్షేమం..**

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నియోజకవర్గంలో పెద్దపీట వేయడం -మిగతా4లో..



వండిన భోజనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

## అందాల భామలపై ఉన్న ప్రేమ... విద్యార్థులపై లేదు

- విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నావు..
- పదేళ్ల అభివృద్ధిని నాశనం చేస్తున్నావు...
- సుమోటోగా కేసు స్వీకరించాలి
- ఆత్మ విమర్శ చేసుకో రేవంత్ రెడ్డి.. రాజకీయాలు ఉంటే ఎన్నికలప్పుడు చూసుకుందాం...
- గురుకులాల ఘటనలపై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్



మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:**అందాల భామలపై ఉన్న ప్రేమ విద్యార్థులపై లేదని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. అందాల పోటీల్లో లక్ష రూపాయలకు ప్లేటు భోజనం పెట్టి గురుకులాల్లో మాత్రం కలుషిత ఆహారం పెట్టడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. అందాల భామలను చూడడానికి 5సార్లు వెళ్లిన ముఖ్యమంత్రి ఇలాంటి ఘటనలు జరిగిన ఏ ఒక్క చోట కూడా వెళ్లి పరామర్శించిన పాపన పోలేదని ఆయన దుయ్యబట్టారు. ఇలాంటి ఘటనలతో సీఎం రేవంత్‌కు విద్యావ్యవస్థపై, పేద విద్యార్థులపై ఏ మేరకు ప్రేమ ఉందో అర్థం అవుతుందన్నారు. శనివారం రాత్రి కలుషితమైన ఆహారం తిని అస్వస్థకు గురైన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులను పరామర్శించి గురుకుల పాఠశాల నిర్వహణ తీరును మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జిల్లా మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజులతో - మిగతా4లో..

# భవిష్యత్తే లక్ష్యంగా పనిచేయాలి

- జికె ఇన్స్టిట్యూట్ విశ్వవిద్యాలయం స్థాయికి ఎదగాలి
- సీఎం సహకారంతో ఎడ్యుకేషన్ హబ్‌గా మార్పు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై27,ప్రభాతవార్త :** దేశం నిజమైన అభివృద్ధి సాధించాలంటే పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా పనిచేయాలని జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల యాజమాన్యానికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలోని ధర్మాపూర్ శివారులోని ఆల్ మదినా ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ "ఎడ్యుకేషన్ ఈస్ మోస్ట్ పవర్ ఫుల్ వెపన్ విచ్ యు కెన్ యూస్ టు ఛైన్జ్ ది వరల్డ్" అన్న, నెల్సన్ మండేలా గారి మాటలను ప్రతి క్షణం మనం గుర్తు తెచ్చుకోవాలన్నారు. విద్యాభివృద్ధికి తాను ఏస్థాయిలో అయినా పనిచేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. వలసల జిల్లాగా పేరున్న మన మహబూబ్ నగర్ ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చెందాలంటే అందుకు అందరి సహాయ సహకారాలు అవసరమని, అందుకోసం ప్రభుత్వ , ప్రైవేటు సంస్థలు మహబూబ్ నగర్ కు తరలివస్తేనే సాధ్యం అవుతుంది అని ఆయన స్పష్టం చేశారు. ఆల్ మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ వార్షికోత్సవం సందర్భంగా




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం

పేద పిల్లలకు మంచి విద్యను అందివ్వాలని తాను సూచించానని, అతి కొద్ది సమయంలోనే జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఏర్పాటుకు బీజం పడిందని, ఇది మహబూబ్ నగర్ విద్యాభివృద్ధికి శుభపరిణామం అని అన్నారు. జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల అతి త్వరలోనే విశ్వవిద్యాలయంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మహబూబ్ నగర్‌లో ఉన్న వలసలను ఆపాలని ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అత్యధిక సంఖ్యలో నిధులు కేటాయిస్తూ విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వేల సంఖ్యలో ఉపాధ్యాయ నియామకాలను చేపట్టి మూతపడుతున్న పాఠశాలలకు ముఖ్యమంత్రి గారు ఊపిరి పోశారని, తెలంగాణను -మిగతా4లో..

# మరికల్‌లో దారుణం..

## కన్నకూతురిపైనే అత్యాచారం

**నారాయణపేట ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త :** నాన్నంటే రక్షణ. తండ్రి చేయి పట్టుకుని నడిస్తే బిడ్డకు కొండంత ధైర్యం. బయటవాళ్లు ఏమైనా అంటే మా నాన్నకు చెబుతా అని బెదిరిస్తారు పిల్లలు. అలాంటి తండ్రే అఘాయిత్యానికి పాల్పడుతుంటే ఆ ఆడబిడ్డ బయటకు చెప్పుకోలేకపోయింది. ఇక వివరాల్లోకి వెళ్తే నారాయణపేట జిల్లా మరికల్ మండలం పూసలపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి భార్య, కూతురితో కలిసి ఉంటున్నాడు. అతడి కూతురికి 10 ఏళ్లు. ప్రస్తుతం అయిదో తరగతి చదువుతోంది. అయితే శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తండ్రి కూతురిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఈ విషయం తల్లికి చెప్పింది. శనివారం ఉదయం ఆ బాలికను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. దీంతో అనుమానం వచ్చిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి వచ్చిన పోలీసులు ఈ అఘాయిత్యానికి సంబంధించిన వివరాలు ఆ బాలికను అడిగిన తెలుసుకున్నారు. విషయాన్ని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తెలియజేయడంతో సమాచారం అందుకున్న మరికల్ ఎస్ఐ హుటాహుటిన గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. తండ్రి పరారీలో ఉన్నట్లు ఎస్సై రాము తెలిపారు.

# జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 12గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- 202టీఎంసీలకు చేరిన శ్రీశైలం డ్యాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 27, ప్రభాతవార్త:** ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయపూర్ జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. నారాయణపూర్ జలాశయాలు నిండు కుండల్లా మారడంతో దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో జూరాలకు వరద పోటెత్తుతున్నది. జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 10,8000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.226టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 32719క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 81000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు, కుడి కాలువకు 500క్యూసెక్కులు, సమాంతర కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 93962క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

**198టీఎంసీలకు శ్రీశైలం డ్యాం**

**- ఒక గేటు ద్వారా సాగర్‌కు నీటి విడుదల**

శ్రీశైలం జలాశయానికి వరద స్థిరంగా కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో ప్రాజెక్టు ఒకగేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా - మిగతా4లో..

# బీసీల రిజర్వేషన్లను ముస్లింలకు పంచుతామంటే యుద్ధమే

**వనపర్తి ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** బీసీలకు మాత్రమే ఇవ్వవలసిన 42 రిజర్వేషన్లలో ముస్లింలకు 10 పంచుతామంటే జరిగేది యుద్ధమేనని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణ సమీపంలోని లక్ష్మికృష్ణ గార్డెన్స్‌లో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ మెంటేపల్లి పురుషోత్త రెడ్డి సమన్వయంతో వనపర్తి నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ హాజరయ్యారు. ముఖ్యఅతిథి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వేలాదిమంది చదువుకున్న యువత నిరుద్యోగులుగా నోటిఫికేషన్ల కొరకు జాబ్ మేళాల కొరకై పట్టాలు చేత పట్టుకుని తిరుగుతున్నారని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ జాబ్ క్యాలెండర్ ఏమైందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటిదాకా ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్కూల్ కాలేజీలలో గంజాయి మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా దొరకడం వల్ల యువత పెడదారి పడుతున్నారని డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటానన్న రేవంత్ రెడ్డి యువకులను మాదక దవ్యాలకు బానిసలుగా చేసి రాష్ట్రాన్ని మాదకద్రవ్యాల తెలంగాణగా మారుస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల జాగీర్ కాదని పార్లమెంట్లో తెలంగాణ బిల్లు సమయంలో టిఆర్ఎస్ పార్టీకున్న ఇద్దరి ఎంపీలు కూడా ఓటింగ్లో పాల్గొనలేదని కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ లేకున్న బిజెపి పార్టీ సంపూర్ణ మద్దతుతోనే బిల్లు పాస్

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు,ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు

అయి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భవించింది అనే విషయాన్ని గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు మాజీ మంత్రివర్యులు డీకే అరుణ మాట్లాడుతూ పేద ప్రజలత ఆర్థికంగా ఎదగాలని ఆర్థికంగా ఎదిగిన రోజే పేదరికం పోయి ఆర్థిక సమానత్వం సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికాసిత్ భారత్ లక్ష్యంతో పేదలకు, మహిళలకు, యువకులకు, రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విద్యారంగం వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ పట్టణాలతో సమానంగా గ్రామాల అభివృద్ధిని కూడా అత్యధిక కేటాయిస్తున్నారని వివరించారు.



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

కరోనా సమయము నుండి నేటి వరకు 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఐదు కిలోల బియ్యం పంపిణీ చేస్తున్నారని ప్రతి రైతుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిది రూ.6000 ఇస్తూ చరిత్రలోనే అత్యధికంగా రైతులకు మద్దతు ధర రూ. 2360 ఎరువులకు ఇచ్చే సబ్సిడీతో ప్రతి రైతుకు ఎకరానికి రూ. 21000 సాయం నరేంద్ర మోడీ అందిస్తున్నాడని ఈ విషయాలను ప్రతి కార్యకర్త ప్రతి రైతుకు తెలియజేయవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఈనాడు ఏ గ్రామానికి పోయిన ప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని తెలంగాణలో కూడా బిజెపి అధికారంలో -మిగతా3లో..

## ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**పెబ్బేరు, జూలై 27 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో 2007, 08 సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకుని నేటికీ 17 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తరగతిలోని పూర్వ విద్యార్థులందరూ కలసి ఆదివారం పట్టణంలోని పిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులు అందరూ కలుసుకొని మొదటగా జ్యోతి ప్రజ్వలన చేసుకుని సరస్వతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మాన కార్యక్రమాలు, ఉపన్యాసాలు పూర్తిచేసుకుని 2007 నుండి జరిగినటువంటి అనుభవాలను జ్ఞాపకాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులు పూర్వ ఉపాధ్యాయులు అందరూ మిఠాయిలు తినిపించుకొని సంతోషాలను పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కార్యక్రమాన్ని సంతోషంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు రవీందర్, రాధారాణి, బాలరాజు, సూర్య కర్ణ, రాఘవేందర్ గౌడ్ కుమార్ మురళి, రాజేష్ గౌడ్, పూర్వ విద్యార్థులు రాజశేఖర్, వీరారెడ్డి, సురేష్, శ్రావణ్, రఘు, బాలరాజు, అశోక్, రాజు, మంజుల, తులసి, గౌరీ, వరలక్ష్మి, అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించిన సన్నివేశం

## అక్రమ చొరబాటుదారుల ఓట్లు తొలగించడం హర్షణీయం

**బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్**

**నారాయణపేట,జూలై 27 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణ కేంద్రంలోని విలేకరుల సమావేశంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్ మాట్లాడుతూ తొలగించిన రోహింగ్యాల ఓట్లకు నిరసనగా కాంగ్రెస్ ఎంపీలు ప్లకార్డులు పట్టుకొని నిరసన చేయడంపై దేశభద్ర్తపై కాంగ్రెస్ పార్టీ కున్న చిత్తశుద్ధిని భారతీయ జన తా పార్టీ తీవ్రంగా ఖండించడం జరిగింది. దేశంలోని నలుమూలల అల్లర్లు రేకెత్తిం చడానికి రోహింగ్యాలను కాంగ్రెస్ పార్టీ, తృణముల్ కాంగ్రెస్‌లే పెంచి పోషించి ఓటు బ్యాంకు ద్వారా బెంగాల్. అస్సాం తదితర రాష్ట్రాలలో అధికారంలోకి రావాలనే హేయమైన చర్యలను అవలంబించడం కాంగ్రెస్ పార్టీ డిఎన్ఏలోనే ఉందని పేర్కొన్నారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ పార్టీ కుటిల నీతిని తిప్పి కొట్టడానికి, దేశ ప్రజల భద్రతా దృష్ట్యా ఎన్ఆర్‌సి, యుసిసి లాంటి చట్టాల ఆవశ్యకత ఎంతైనా ఉందని వీటిని దేశ ప్రజలంతా స్వాగతిస్తున్నారని, రాబోవు రోజుల్లో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు, బంగ్లాదేశ్ చొరబాటు దారులను గుర్తించి దేశ ప్రక్షాళన చేయడం తథ్యమని పేర్కొన్నారు. అక్రమంగా చొరబాట్ల ద్వారా దేశమంతా నివసిస్తున్న రోహింగ్యాల ఫేక్ ఓట్లను ఎన్నికల కమిషన్ గుర్తించి వాటిని తొలగించాలని తెలియజేశారు.

## చెట్టును ఢీకొట్టిన కారు... తప్పిన పెను ప్రమాదం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై అదుపు తప్పి కారు చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. దోమల పెంట పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం ఉదయం శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం కోసం మహబూబ్‌నగర్‌కు చెందిన డ్రైవర్ రాజు, మిన్ను గౌడ్, కావలి సైదులు,వడ్డీవికాస్,కావలి ఆదిత్య, గోపి, సంకీర్త్ అనే యువకులు కారు తీసుకొని మహబూబ్‌నగర్ నుండి శ్రీశైలం వెళుతున్న క్రమంలో శ్రీశైలం ఘాటులోని దోమలపెంట గ్రామానికి 4 కిలోమీటర్ల సమీపంలో అతివేగంగా వెళుతున్న కారు బోల్తా పడటంతో రాజు, మిన్నుకు తీవ్ర గాయాలయ్యాలు. ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రమాదానికి గురైన కారు

## టీయుడబ్ల్యూజే (ఐజేయు) కల్వకుర్తి మండల అధ్యక్షుడిగా ఎండి.జహీర్

**కల్వకుర్తి, జూలై 27 ప్రభాతవార్త:** టీయుడబ్ల్యూజె (ఐజేయు) కల్వకుర్తి మండల అధ్యక్షునిగా ఎండి. జహీర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లె రాజన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో ఆదివారం టీయుడబ్ల్యూజే (ఐజేయు) నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షులు విజయకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం మండల కమిటీని ఏకగ్రీవ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా ఎండి.జహీర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లె రాజన్న, ఉపాధ్యక్షులుగా షఫీవూర్ రెహ్మాన్, కోశాధికారిగా బాల్ జంగయ్య, సహాయ కార్యదర్శిగా ముత్యాల నరేష్, కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులతో పాటు మరో ఇద్దరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ మోహన్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, నందు యూసుఫ్, శేఖర్, నరేష్ గౌడ్, సమ్మద్, మజిద్, ఫయాజ్, తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

## గొర్రె కాపరుల కుటుంబాలను ఆదుకోవాలి

**సిపిఎం పార్టీ మండల కన్వీనర్ సుతారి తిరుమల**

**కోయిలకొండ, జూలై 27 ప్రభాతవార్త :** చిరుత పులి దాడిలో గాయాల పాలైన గొర్రె కాపరుల కుటుంబాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం పార్టీ మండల కన్వీనర్ సుతారి తిరుమలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కోయిలకొండ మండలంలోని కొత్లాబాదు గ్రామానికి వెళ్లి గొర్రెల మందను ఆపిన ప్రదేశాన్ని పరిశీలించి చిరుత పులి దాడి చేసి ఐదు గొర్రెలను హతమార్చిన విషయాన్ని తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుత పులి దాడిలో గాయాల పాలైన గొల్ల మై బన్న, చెన్నారెడ్డి కుటుంబాలను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలన్నారు. గొర్రెలే జీవనాధారంగా జీవిస్తున్న గొల్ల మైబన్న కుటుంబానికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వీరిద్దరికీ నాణ్యమైన వైద్య చికిత్సలు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

## ఈ గుంత పూడ్చరూ....

**అవస్థలు పడుతున్న ప్రజలు**

**దామరగిద్ద, జూలై 27 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కల్వర్టు దగ్గర ఆర్‌అండ్‌బి రోడ్డు దెబ్బతిని పెద్ద గుంతగా మారింది .వర్షాకాలం కావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా దాన్ని పట్టించుకునే నాధుడే లేడు నిత్యం వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు మొద్దు నిద్ర వీడి రోడ్డును బాగు చేయాలని, ఇష్టానుసారంగా రోడ్డు తవ్వుతుంటే కూడా అధికారులు పట్టించుకోవడంలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై పడిన గుంత

# ఎడతెరిపి లేని వర్షాలు..

### చిత్తడిగా మారుతున్న రోడ్లు.. అంటూ రోగాలు ప్రబలే అవకాశం

**దేవరకద్ర, జూలై 27 ప్రభాతవార్త:** అల్పపీడన ద్రోని కారణంగా గత పది రోజులగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. విరామం లేకుండా ఉదయం నుండి రాత్రి వరకు వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. ఒకపక్క అల్పపీడన ద్రోని, మరోపక్క రుతుపవనాలు తిరిగి ప్రవేశించడంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు విరామం లేకుండా కురవడంతో జనజీవనానికి కొంత ఇబ్బంది కలిగే పరిస్థితులు ఏర్పడ్డాయి.

**చిత్తడిగా మారిన రోడ్లు.**

కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కౌకుంట్ల మండల కేంద్రంలో వివిధ ప్రాంతాలలో రోడ్లు చిత్తడిగా మారిపోయాయి. అదేవిధంగా మురుగు కాలువల్లో నీరు ఎక్కువ మోతాదులో నిర్వహించడం, కాల్వల పక్కన చెత్త చెదారం పేరుకుపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిత్తడిగా మారిన రోడ్లమీద వాహనదారులు, ప్రజలు, ప్రయాణించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాలలో రోడ్లమీద వర్షపు నీరు నిలబడి బురదమయంగా మారిపోయాయి. గ్రామపంచాయతీ అధికారి, ప్రత్యేక అధికారి సత్వర చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మారిన రోడ్లు

**అంటు రోగాలు ప్రబలే అవకాశం..**

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలే కాకుండా, మున్ముందు వచ్చే వర్షాలు దృష్టిలో పెట్టుకొని అధికారులు గ్రామాలలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే చిత్తడిగా మారిన రోడ్లు, మురుగు కాలువల్లో నిలిచిపోయిన మురుగునీరు, రోడ్ల వెంట పేరుకుపోయిన చెత్త కారణంగా అంటూ రోగాలు ప్రభలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం పడడం వల్ల బురద దుర్గంధ పూరిత వాసన వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని మురుగునీరున్న ప్రాంతంలో బ్లీచింగ్ చేయడం, దోమల మందు వేయడం,చెత్తను తొలగించడం, మురుగునీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా మారిన రోడ్లు

## 13వ రోజుకు చేరిన భూ నిర్వాసితుల రిలే దీక్ష

**నారాయణపేట టౌన్, జూలై 27 ప్రభాతవార్త :** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూనిర్వాసితులకు ఇచ్చే పరిహారం న్యాయంగా లేదని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్కు వద్ద చేపట్టిన రిలే దీక్ష ఆదివారంతో 13వ రోజుకు చేరుకుంది. భూ నిర్వాసితుల రిలే దీక్షకు ముఖ్య వక్తగా హాజరై మాట్లాడుతూ ఎకరముకు రూ.14 లక్షలు ఆమోద యోగ్యం కాదనీ రైతులు ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోకుండా బలవంతం భూసేకరణ చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వము దయతో కాదు రైతు రావాల్సింది చట్టం ప్రకారం చెల్లించాలన్నారు. జిఓ 69 ప్రకారం ఈ ప్రాజెక్టును పోరాడి సాధించుకున్నాం జిల్లాని పొరాడిసాధించుకున్నామన్నారు. పోరాటం మన ప్రాంత వాసులకు కొత్త కాదన్నారు. పాలకులు చిత్తశుద్ధితో న్యాయం చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ మనవాడే ఉన్నప్పటికి రైతుకు మేలు జరగకపోతే ఉద్యమమే శరణ్యమన్నారు. రైతులు ఐక్యంగా ఉద్యమిస్తే ఎంత మొండి ప్రభుత్వం ఉన్నా దిగిరాక తప్పదన్నారు. నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు నిర్మాణం ఖర్చు 4500 కోట్ల కాంట్రాక్టర్ల మేలు కోసం ప్రాజెక్ట్ ఖర్చు 10 వేల కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం సిద్ధపడే అవకాశం ఉంది కాని రైతుకు ఏకరానికి 30 లక్షలు ఇచ్చినా 600 కోట్లు మాత్రమే ఖర్చు అవుతుందన్నారు. రైతులు సంతోషంతో సంతకాలు పెట్టాలి కానీ పాలకులు కల్పిస్తున్న పరిస్థితి వలన దుఖంతో భయంతో కన్నీళ్లతో రైతుల చేత సంతకాలు పెట్టించుకోవడం బాధకరమన్నారు. ఎద్దు ఏడ్సిన వ్యవసాయం రైతు ఏడ్సిన రాజ్యం బాగుపడదన్న విషయం గుర్తెరుగాలన్నారు. ఇచ్చే పరిహారంతో భూమికి భూమి కొనుకునే ధైర్యం రైతుకు కల్గినపుడు మాత్రమే ప్రాజెక్ట్‌కు భూములు సంతోషంగా ఇస్తారన్నారు. 13వ రోజుకు చేరుకున్న భూనిర్వాసితుల రిలే దీక్షలలో జి. వెంకట్రామిరెడ్డి, మశ్చేంధర్, ధర్మరాజు, గోపాల్, బాల్ రాం, కానుకూర్తి గ్రామం మాజీ సర్పంచ్ భీమ్‌రెడ్డితో బాటు 13వ రోజు రిలే దీక్షలలో కానుకూర్తి, మల్రెడ్డిపల్లి గ్రామ భూనిర్వాసితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్

## ఆశ, అత్యాశలే సైబర్ నేరగాళ్ల ఆయుధాలు

### డబ్బులు పోయాక బాధపడడం కంటే ముందే జాగ్రత్త పడండి

### సైబర్ మోసాలకు 1930 లేదా 100 డైల్ చేయండి : జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** విలాసవం తమైన వస్తువులిస్తామని, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తామని, విదేశీ యాత్రలకు పంపుతామని, రక రకాల మాయమాటలతో ఆఫర్లు పెట్టి, ప్రజల నుండి మొదటగా సభ్యత్వాలను స్వీకరించి, వారితో మరికొంతమందిని సభ్యులుగా చేర్పించే ప్రయత్నం చేస్తూ, ఎంత ఎక్కువ మందిని సభ్యులుగా చేర్పిస్తే అంత అధిక మొత్తంలో డబ్బులు తిరిగొస్తాయని నమ్మించి ప్రజల్ని మభ్యపెట్టే కొత్త కొత్త టెక్నిక్‌లతో సైబర్ నేరగాళ్లు మార్కెట్లోకి వస్తున్నారని,ఇలాంటి నూతన స్కీంల పట్ల, నేరగాళ్ల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందనీ జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు జరుగుతున్న తీరు,సైబర్ నేరాలకు ప్రజలు గురైతున్న విధానం,ప్రజలు సైబర్ నేరాలకు గురి కాకుండా జాగ్రత్త పడాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని తెలిపారు. మొబైల్ కు లేదా సోషల్ మీడియా ఫ్లాట్ పామ్‌లో అనేక కంపెనీల పేర్లతో బ్లూ లింక్ ద్వారా ఫైల్ వస్తుందని దానిని ఇంస్టాల్ చేసుకున్నాక అప్లికేషన్‌లో రిజిస్టర్ అయిన తరువాత ఒక వాట్సాప్ గ్రూపుకు యడ్ చేస్తారని, వారు అంతకుముందు పెట్టినా ఇన్వెస్ట్మెంట్, వచ్చినా ప్రాఫిట్ కు సంబంధించిన నకిలీ పత్రాలను గ్రూపులో షేర్ చెయ్యగా వాటిని నమ్మి మొబైల్ వినియోగదారులు ఇన్వెస్ట్మెంట్ పెట్టడం జరుగుతుందని, మొదట చిన్నా చిన్న అమౌంట్ కు లాభాలు వెంటనే ఇస్తారని, ఎక్కువ అమౌంట్ పెట్టాక రెస్పాండ్ కారని, అలాగే ఇంకో విధానంలో నెక్స్ట్ లెవెల్ అంటూ ఎక్కువ అమోంట్ తో ఎక్కువ సంఖ్యలో ఒకరి క్రింద ఒకరిని జాయినింగ్ చేయిస్తూ, వీక్ ఎండ్‌లలో సక్సెస్ మీటింగ్‌లు పెడుతూ ఎక్కువ మందిని జాయిన్ చేపించిన వారిని సత్కరిస్తూ మరింత ఎక్కువ మందిని జాయిన్ చేసేలా ప్రోత్సహిస్తారని, ఎక్కవ సంఖ్యలో ప్రజలు జాయిన్ అయి భారీగా పెట్టుబడులు పెట్టాక ఒకే సారి కంపని ఎత్తేస్తారని, ప్రజలు ఒక్క ముఖ్య విషయం గుర్తుంచుకోండి, ఎవరూ ముఖ్యంగా మనకు ఎటువంటి సంబంధం లేని వాళ్ళు మనకు ఏ విధమైన ఆర్థిక ప్రయోజనం ఊరికే చెయ్యరు. మనల్ని నమ్మించి, మభ్యపెట్టి, వంచించి మన దగ్గరి, మన ద్వారా మరికొందరి కష్టార్జితాన్ని కొల్లగొట్టడమే వారి పని ఒకవేళ మీరు అన్ని జాగ్రత్తలను తీసుకున్నా కూడా మోసపోయిన పక్షంలో ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా 1930 టోల్ ఫ్రీ నంబర్ కి గానీ, సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కానీ లేదా మీ సమీప పోలీస్ స్టేషన్ లో నైనా వెంటనే పూర్తి వివరాలతో పిర్యాదు చెయ్యాలని బ్యాంకు వారితో మాట్లాడి అమాంట్ ను హోల్డింగ్ చెపించడం, గ్రామాలలో సైబర్ వారియర్స్ ద్వారా ప్రజలకు అవేర్నెస్ కల్పించడం జరుగుతుందని అన్నారు.

## ఘనంగా డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు

**అయిజ జూలై 27, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోనీ బాలుర ఉన్నత పాఠశాల లో ఆదివారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాలు మరియు1998.99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించి ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ అంతరిక్ష శాస్త్ర వేత్త రాజకీయవేత్త మాజీ రాష్ట్రపతి పద్మభూషణ్ పద్మవిభూషణ్ భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం కలం వేడుకలు నిర్వహించడం ఎంతో గర్వకారణం అని అన్నారు. భౌతిక ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నాలుగు దశాబ్దాల పాటు శాస్త్రవేత్తగా సైన్స్ అడ్మినిస్ట్రేటర్గా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ ఇస్రో అంతరిక్ష కార్యక్రమం సైన్స్ అభివృద్ధి ప్రయత్నాలు బాలిస్టిక్ మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా గా ప్రసిద్ధి చెంది ప్రపంచంలోనే భారతదేశాన్ని అగ్రగాముల నిలిచేందుకు ఆయన సేవలు ఎంతో దోహదపడ్డాయని అన్నారు. పోక్రాన్ 2 అను పరీక్షలలో అతను కీలకమైన సంస్థాగత సాంకేతిక మరియు అనువర్తన ఆయుధాలు అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషించిన రాజకీయ శాస్త్రవేత్త నీ అన్నిటికంటే మించి ఆయన ద భారత మాత సేవలో తరించిన నిజమైన భారతీయుడు దేశభక్తుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు, తూముకుంట కిష్టన్న, భీమ్ ఆర్మీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మాచర్ల ప్రకాష్, భీమ్ ఆర్మీ నాయకులు బలిగెర మోజెస్,1998 99 పూర్వ విద్యార్థులు మొదలగు వారు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం వర్ధంతి వేడుకలు

## మక్తల్‌లో ఫింగర్ ప్రింట్ డివైస్‌తో ఆకస్మిక తనిఖీలు

**మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి**

మక్తల్ టౌన్, జూలై 27 ప్రభాతవార్త: మక్తల్ మక్తల్ పట్టణ ప్రాంతాలలో ముఖ్యమైన జనాభా అధికంగా ఉండే స్థలాలు, బస్టాండ్, బ్యాంకుల వద్ద రద్దీ గల ప్రధాన చౌరస్తాల్లో దొంగతనాలు నిర్మూలించడానికి ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా పూర్తి స్థాయిలో నిఘా ఉంచి, ఫింగర్ ప్రింట్ డివైస్‌తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ మక్తల్ బస్టాండ్, బ్యాంక్ ల వద్ద అనుమానిత వ్యక్తులను ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని, బస్టాండ్‌లో ప్రయాణికుల మాటున కొంతమంది వ్యక్తులు రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వాటికి చెక్ పెట్టడానికి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బస్టాండ్ లో ప్రయాణికులు బస్సు ఎక్కి దిగే సమయంలో జాగ్రత్తలు పాటించాలని మరియు తమ విలువైన బంగారు వస్తువులను, బ్యాగులను, పర్సులను జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు అలాగే అపరిచిత వ్యక్తులు ఏమైనా తినుబండరాలిస్తే తీసుకోరాదని ప్రయాణికులకు సూచించారు. అలాగే బ్యాంకుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేసుకోవడానికి, అమౌంట్ డిపాజిట్ చేయడానికి వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బ్యాంకుల వద్ద దొంగలు మాట వేసి వెంట ఫాలో అయి దొంగతనాలకు పాల్పడుతున్నారని అలాంటి వారి పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎస్సై కోరారు. మక్తల్ పరిధిలో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కి లేదా లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో మక్తల్ పోలీసులు నరేష్, తిరుపతి పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

## అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల

**శ్రీరాజరాజేశ్వరి సహిత, సీతారామాంజ నేయస్వామి తృతీయ బ్రహ్మోత్సవాల్లో ఆల దంపతులు**



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆల కుటుంబ సభ్యులు

**భూత్పూర్,జూలై 27,ప్రభాతవార్త :** భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో మూడేళ్ల క్రితం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో నిర్మించిన శ్రీరాజరాజేశ్వరి సహిత రాజరాజేశ్వర,సీతారామాంజనేయ స్వామి ఆలయ మూడో వార్షికోత్సవం,వార్షిక బ్రహ్మోత్సవాలు అన్నాసాగర్‌లో ఆదివారం ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆల దంపతులు స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆల ఆయన సతీమణి మంజుల ఇతర కుటుంబ సభ్యులు,ఆల సోదరుడు ఆల శ్రీకాంత్‌రెడ్డితో పాటు గ్రామస్తులు,పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌లో అంతరాయం

**గద్వాల,జూలై 27, ప్రభాతవార్త:** నది అగ్రహారం రోడ్డులో ఉన్న 132 కేవీ విద్యుత్ సబ్స్టేషన్లో అత్యవసర మరమ్మత్తులు వున్నందున సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు డిఈ తిరుపతిరావు తెలిపారు.ఉదయం 7: 30గంటల నుండి 9:30గంటల వరకు విద్యుత్ సరఫరాలో వివిధసబ్‌స్టేషన్లలో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. బిజ్వారం సబ్స్టేషన్,కాకులారం సబ్స్టేషన్ మల్దకల్ సబ్స్టేషన్, మల్లెందొడ్డి,బూడిదపాడు, మన్నాపురం సబ్స్టేషన్,ధరూరు సబ్స్టేషన్, (ధరూర్ టౌనుకు సప్లై ఉంటుంది) , గోన్పాదు సబ్స్టేషన్, శెట్టి ఆత్మకూరు సబ్స్టేషన్ లలో విద్యుత్ అంతరాయం ఉంటున్నందున వినియోదారులు గమనించి సహరించ గలరని వారు కోరారు.

## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డీకే అరుణకు వినతి



డీకే అరుణకు వినతి పత్రం అందజేస్తున్న డీలర్లు

**గద్వాల, జూలై 27, ప్రభాత వార్త:** రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని జోగులాంబ గద్వాల జిల్లా రేషన్ డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు రాములు ఆధ్వ ర్యంలో మహ బూబ్నగర్ ఎంపీ డీకే అరుణ కు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ఉదయం వివిధ గ్రామాల నుంచి అయిజకు చేరుకున్న డీలర్లు వాహనాల్లో గద్వాలకు బయలుదేరారు. గద్వాలలో డీకే అరుణ ను కలిసి సమస్యలను విన్నవించారు. డీలర్ల సమస్యల పరిష్కారంపై ఆమె సానుకూలంగా స్పందించారు.

## తిరుపతిలో గూడూరు కళాకారుని ప్రియ ప్రదర్శన

**చిన్న చింతకుంట, జూలై 27 ప్రభాతవార్త:** తిరుపతిలో అభిన య ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ 25వ వార్షికోత్సవ సందర్భంగా మహతి ఆడిటోరియంలో నిర్వహించిన తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో మహతి ఆడిటోరియంలో నిర్వహించిన కూచి పూడి పోటీలలో గూడూరు గ్రామానికి చెందిన నంబిషణ్ముఖ ప్రియ ఆదివారం ప్రదర్శించారు. కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో అలరించింది. ఈ సందర్భంగా కళాకారుని షణ్ముఖ మాట్లాడుతూ వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రదర్శన ఇచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. తమ కూతురి కూచిపూడి నృత్య ప్రదర్శన చూసి తల్లిదండ్రులు పూజారి లక్ష్మినారాయణ, సరళ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారుని

# విద్యార్థులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటాం

- నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి
- ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటాం : అదనపు కలెక్టర్ పి అమరేందర్
- ఉయ్యాలవాడ గురుకుల పాఠశాల బాలికల ఆరోగ్యం నిలకడగా ఉంది : వైద్యుల వెల్లడి



విద్యార్థినులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే



ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పి.అమరేందర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:**నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలో ఉన్న మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో 50 మంది బాలికలను పాఠశాల సిబ్బంది నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. 50 మంది డిశ్చార్జి అవగా, ఇంకా 10 మంది చికిత్స పొందుతున్నారని తెలిపారు. పూర్తిగా తోడుకోని పెరుగు తినడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ తెలిపారు. విద్యార్థుల పూర్తి స్థాయి వైద్య వివరాల అనంతరం డిశ్చార్జి కానున్నట్లు ప్రిన్సిపల్ లలిత తెలిపారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు పిఅమరేందర్, దేవ సహాయం, డిఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మిలు ఆసుపత్రికి చేరుకొని విద్యార్థినులను పరామర్శించారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు అదనపు కలెక్టర్ సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని ఎలాంటి ఇబ్బందీ లేదని వైద్యులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని, మేము విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులుగా వ్యవహరిస్తామని, విద్యార్థుల పట్ల మెరుగైన వస్తువులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, విద్యార్థుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి ఇబ్బందీ లేదని, 2,3 గంటల్లో విద్యార్థులు పూర్తిస్థాయిలో ఆరోగ్యవంతంగా ఆసుపత్రి నుంచి డిస్చార్జ్ అవుతారని, విద్యార్థులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, తల్లిదండ్రులు ఎవరు అధైర్య పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే సందర్భంగా తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అదనపు కలెక్టర్ పి అమరేందర్ మాట్లాడుతూ శనివారం రాత్రి గురుకుల పాఠశాలలో విద్యార్థుల అస్వస్థకు గురైన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు లేదని పూర్తిస్థాయిలో ఆరోగ్యవంతంగానే ఉన్నారని వైద్యులు వెల్లడించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల అస్వస్థత గల కారణాలను తెలుసుకునేందుకు వివిధ రకాల ఆహార పదార్థాలను, త్రాగునీటి పరీక్షలకు శాంపిల్‌కు పంపించడం జరిగిందని, నివేధిక అందిన తర్వాత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై పూర్తి నివేధికలను పరిశీలించనున్నట్లు ఆయన తెలిపారు. గురుకుల బీసీ వెల్ఫేర్ సెక్రెటరీ సైదులు గురుకుల పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందించిన ఆహార పదార్థాల శాంపిల్స్‌ను సేకరించారు. అదనపు బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీరాములు తదితరులు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

## బిజెపి వైపే ప్రజల చూపు

**బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రారావు**

**పెబ్బేరు, జూలై 27 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణానికి బిజెపి నూతన అధ్యక్షులుగా ఎన్నికైన నెలలోపే మొదటిసారిగా పెబ్బేర్ పట్టణానికి చేరుకున్న రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు రంగపూర్ బైపాస్ నుంచి సుభాష్ చౌరస్తా వరకు ఉమ్మడి పెబ్బేరు మండల బిజెపి నాయకులు బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. స్థానిక సుభాష్ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్‌కు పూలమాల వేసి అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ నాకు రాజకీయ బిక్ష పెట్టింది పాలమూరు జిల్లానని జిల్లాకు ఎంతో రుణపడి ఉంటానని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి గెలవడం ఖాయమని ప్రజలు కూడా బిజెపి వైపే మొగ్గు చూపుతున్నారని తెలియజేశారు. అసెంబ్లీ ఎన్నికలలో బిజెపిని గెలిపించుకుంటే తెలంగాణను ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇంతవరకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలకు వెంటనే అమలు చేయాలని లేకుంటే ప్రజల పక్షాన పోరాడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నారాయణ, ఎంపీ అభ్యర్థి పోదుగంటి భరత్ ప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, సబిరెడ్డి వెంకట్ రెడ్డి, కొప్పు భాష,గౌని వేమారెడ్డి, ఎలక్షన్ పాబారి పురుషోత్తం రెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు క్రాంతి కుమార్ నాయుడు, నాయకులు రాఘవేందర్ గౌడ్, రంగస్వామి గౌడ్, కంచ ఆంజనేయులు, శ్రీనివాస్ గౌడ్, భగవంతు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక సుభాష్ చౌరస్తాలో మాట్లాడతున్న రామచంద్రారావు

## యువత స్వయం ఉపాధి రంగాలలో రాణించాలి

**-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**వెల్దండ, జూలై 27 ప్రభాతవార్త:**యువత స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని అందులో రాణించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని బొల్లంపల్లి చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్‌కు ఆదివారం నిర్వాహకులతో కలిసి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఉపాధి రంగాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అండగా ఉంటుందని అన్నారు. ఫంక్షన్ హాల్ నిర్వాహకులు అల్లంపల్లి కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్, రాజ్ మహమ్మద్, రమేష్‌లు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ ఉమా మనీలా సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీపీ జయప్రకాష్,నాయకులు పర్వత్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మట్ట వెంకటయ్యగౌడ్, ఉప్పు ఆంజనేయులు, తిరుమల్‌రావు, హనుమంత్ నాయక్, పుల్లయ్య, శేఖర్, కృష్ణారెడ్డి,శంకర్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ఎండి రషీద్, హరికిషన్‌నాయక్, కాడురామ్, అరుణ్‌నాయక్, లక్ష్మణ్, అంజయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## టీయుడబ్ల్యూ ఐజేయు మండల కమిటీ అధ్యక్షుడిగా మిర్యాల రాజయ్య

**వెల్దండ, జూలై 27 ప్రభాతవార్త:**టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు విజయకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వెల్దండ మండల కేంద్రంలో ఐజేయు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షులుగా మిర్యాల రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా బొమ్మిశెట్టి శ్రీనివాసులు, కోశాధికారిగా పూరి రమేష్, ఉపాధ్యక్షులుగా వెల్దండ రామకృష్ణ, కార్యవర్గసభ్యులుగా నరసింహ, శ్రీనివాసులును ఎన్నుకున్నారు. అదే విధంగా నూతన కమిటీని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వెల్దండ గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనిలా సంజీవ్‌యాదవ్‌లు శాలువాలతో సన్మానించి అభినందించారు. కమిటీఎన్నికకు ముఖ్య అతిథులుగా సీనియర్ జర్నలిస్టు బచ్చు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు చేగురి శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టులు మోహన్, పాశం యాదగిరి, జిల్లా ఈసీ మెంబర్ గంగదారిమల్లేష్,సీనియర్‌జర్నలిస్టులు తంబాలు యాదవ్, నూకం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు అనంతరం నూతనకార్యవర్గ సభ్యులను, ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.



నూతన కమిటీని సన్మానిస్తున్న దృశ్యం

## నేడే విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఇటిక్యాల, జూలై 27 ప్రభాతవార్త :** చాగపురం సబ్ స్టేషన్ నుండి నాణ్యమైన విద్యుత్ సరఫరా కొరకు మండల పరిధిలోని చాగాపురం సబ్ స్టేషన్‌లో విద్యుత్ పనులు కొనసాగుతుండగా సోమవారం మధ్యాహ్నం 2 గం.ల నుండి 4 గం.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడిఏ నవీన్ బాబు, ఇటిక్యాల మండల విద్యుత్ ఏఈ శేఖర్ తెలిపారు. చాగాపురం 33 కెవి సబ్ స్టేషన్‌లో కొత్త ట్రాన్స్ ఫార్మర్ పనులు చేపడుతుండగా చాగాపురం, షాబాద్, వల్లూరు, బుద్ధారెడ్డిపల్లి, శనగపల్లి, బట్లదిన్నె, ఉదండాపురం గ్రామాలకు సోమవారం మధ్యాహ్నం 2 గం.ల నుండి 4 గం.ల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అందుకు విద్యుత్ వినియోగదారులు, రైతులు, రైతు సంఘాలు గ్రామాల ప్రజలు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని అల్లంపూర్ విద్యుత్ శాఖ ఏడిఏ నవీన్ బాబు, ఇటిక్యాల మండల విద్యుత్ శాఖ అధికారి శేఖర్ పై గ్రామాల ప్రజలు రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మండల యాదవ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**శ్రీరంగాపూర్,జూలై 27 ప్రభాతవార్త:**శ్రీరంగాపురం మండల కేంద్రంలోని శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా నక్క భాస్కర్, అధ్యక్షులు కటిక చింతలయ్య, కన్వీనర్ వసంతపురం రాజు, ఉపాధ్యక్షులు రాస మల్ల స్వామి,వసంతపురం రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి పెండెం సతీష్, సహాయ కార్యదర్శి కటికే రామకృష్ణ,కోశాధికారి వసంతపురం బుచ్చన్న,సలహాదారులు భాస్కర్ బాలకృష్ణ, బోడ బాలస్వామి, ముంత మద్దిలేటి, చింతల రాముడు, కార్యవర్గ సభ్యులు కటిక మహేష్, రాసమల్ల రాజు, శేఖర్, కొత్త సాయమ్మ శివ ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ యాదవ సంఘం సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సంఘ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందిస్తామని తెలియజేయడం జరిగింది. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## మురికి గుంతలతో ఇబ్బందులు

**డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశాలు పట్టించుకోని అధికారులు**

**భయపడుతున్న కాలనీ వాసులు**

**మద్దూర్, జూలై 27 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా మురికి కాలువలు మురికి గుంతలు ఉండడంతో ఆయా కాలనీ వాసులు భయపడుతున్నారు. ప్రజలు వనకలం రావడంతో చినుకు పడితే చాలు చిత్తడిగా ఆయా కాలనీ రోడ్డులో తయారవుతున్నాయి. ప్రజలు ఇళ్లలో నుంచి బయటికి రావాలంటే భయపడుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని పలువురు అంటున్నారు. పలు కాలనీలో అపరిశుభ్రంగా ఉండటం వలన వాటిపైన దోమలు నివాసం చేస్తూ దానిలో కొన్ని డెంగ్యూ వ్యాధి తీసుకువచ్చే దోమలు ఉంటాయని అందు గురించి ప్రజలు భయపడుతున్నారు. నీరు నిల్వ కావడంతో మురికి వాసన కంపు కొట్టడం వలన ఇళ్లలో నుంచి బయటికి రాలేకపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొంతమంది కొన్ని కాలనీలో చిన్న పిల్లలను రోడ్డుపైనే మలమూత్రాలు చేయించడం వలన వాటిపై ఈగలు దోమలు కూర్చొని ఇంట్లోకి వచ్చి తినే వస్తువులపై కూర్చోవడం వలన పలువురు దవాఖానాల చుట్టూ తిరుగుతున్నారని ప్రజలు వాపోతున్నారు.



బురదమయంగా రోడ్లు

## బీసీల రిజర్వేషన్లను ముస్లింలకు పంచుతామంటే యుద్ధమే

మొదటి పేజీ తరువాయి భాగం..

రావాలని ప్రజలనుకుంటున్నారని దానికి బీజం వేయాలంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్లు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటిసి, ఎంపీపీ, జిల్లా పరిషత్ చైర్మన్, కౌన్సిలర్ ,మున్సిపల్ చైర్మన్ లను అత్యధికంగా బిజెపి గెలవాలని పదేండ్ల అవినీతి బీఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపించారని 421 హామీలతో అధికారంలోకి వచ్చి 20 నెలలైనా మాటలు తప్ప రేవంత్ చేతల్లో లేదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు చేరవేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎంపీ పోతుగంటి రాములు, జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్, మాజీ శాసనసభ్యులు డా.రావుల రవీంద్రనాథ్ రెడ్డి, సర్పంచ్ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ మెంటే పల్లి పురుషోత్తం రెడ్డి ,జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్.లోకనాథ్ రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి, అయ్యగారి ప్రభాకర్ రెడ్డి ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మున్నూరు రవీందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, గౌని హేమారెడ్డి, మోర్చాల రాష్ట్ర నాయకులు బి. శ్రీశైలం, జ్యోతి రమణ,చిత్తారి ప్రభాకర్, కదిరే మధు, అలివేలమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్, జిల్లా నాయకులు సుమిత్రమ్మ ,కుమారస్వామి, వెంకటేశ్వర రెడ్డి, బాశెట్టి శ్రీను ,సీతారాములు ,పెద్దిరాజు, బోయల రాము, శివారెడ్డి తిరుమలేష్, బాబు రావు, రాఘవేందర్ గౌడ్, అశ్విని రాధా, ఎండి ఖలీల్, రవి నాయక్, ప్రవీణ్ కుమార్ ,రాజశేఖర్ గౌడ్, వెంకటేష్, తిరుపతిరెడ్డి, చెన్నయ్య, బుచ్చిబాబు గౌడ్, నాగరాజు, క్రాంతి, నాయుడు, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

### గ్రామ పాలనాధికారి, లైసెన్స్డ్ సర్వేయర్

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం కోసం పరీక్షా కేంద్రాలను ఆదివారం అదనపు కలెక్టర్ సంచిత్ గాంగ్వార్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 76 మంది అభ్యర్థులకు గాను, 73 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరు అయినట్లు ఆయన తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన పరీక్షకు 106 మంది అభ్యర్థులకు గాను 96 మంది హాజరయ్యారని, 10 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. అనంతరం లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగిన పరీక్షకు 106 మంది అభ్యర్థుల గాను 95 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి ఎలాంటి కాపీయింగ్ జరుగకుండా పరీక్షను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్‌తో పాటు ఆర్డిఓ రామచంద్రనాయక్, సర్వే ల్యాండ్ ఏడీ గిరిధర్, డిపార్ట్మెంటల్ అధికారులు, తహశీల్దార్ అమరేంద్ర కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను చైతన్యపరుస్తాం..

**- తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దోరేపల్లి లక్ష్మీ రవీందర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై27,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం నూతన మహిళ అధ్యక్షురాలుగా దోరేపల్లి లక్ష్మీ రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలంగాణముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా, జడ్చర్ల మాజిమునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీరవీందర్ ముదిరాజ్‌ని సంఘ రాష్ట్రకార్యాలయంలో రాష్ట్రఅధ్యక్షుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ముదిరాజ్ నాయకులు, రాష్ట్ర ముదిరాజ్ మహిళ నాయకురాళ్ల సమక్షంలో ఈ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ ముదిరాజ్ లక్ష్మీ ముదిరాజ్ ని రాష్ట్ర మహిళ అధ్యక్షురాలుగా అంగీకరిస్తూ నియామకం పత్రాన్ని అందజేశారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్రమహిళ అధ్యక్షురాలు దోరేపల్లి లక్ష్మీ రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న ముదిరాజ్ సంఘ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షుల సూచనల మేరకు పని చేస్తూ ముదిరాజులను అన్నీ విధాలుగా చైతన్య పరుస్తూ రాజకీయంగా ఎదగడానికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ముదిరాజ్లను బీసీ డీ గ్రూపు నుండి బీసీ ఏ కు మార్చి ముదిరాజుల ఎదుగుదలకు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆమె కోరారు. అలాగే ఈ పదవి రావడానికి ముఖ్య కారకులైన మహబూబ్ నగర్ జిల్లా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పడాల రజనీకాంత్ ముదిరాజ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కారక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర సంయుర్త కార్యదర్శి సంజనోళ్ల నర్సిములు ముదిరాజ్, తెలంగాణ మత్స్యకారుల సంఘం మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు గోనేల శ్రీనివాస్, తెలంగాణ ముదిరాజ్ సంఘం వికారాబాద్ జిల్లా మహిళ అధ్యక్షురాలు స్వరూప ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు యాదగిరి ముదిరాజ్, సునీల్ ముదిరాజ్, గణేష్ ముదిరాజ్, రవి ముదిరాజ్, జడ్చర్లకు చెందిన శ్రీశైలం ముదిరాజ్, భరత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న దోరేపల్లి లక్ష్మీ రవీందర్

### ఆగస్టు15న పేరూరు ప్రభుత్వ పాఠశాల

## 75 వసంతాల వజ్రోత్సవ వేడుకలు ప్రారంభం

**జనవరిలో సుమారు 2 వేల మందితో పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థుల సమ్మేళనం**

**దేవరకద్ర, జూలై 27 ప్రభాతవార్త:** పేరూరు జడ్‌పిహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల ప్రారంభమై 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాఠశాల వజ్రోత్సవ వేడుకలు నిర్వహించాలని పూర్వ విద్యార్థులు పూనుకున్నారు. దీనికి సంబంధించి కార్యచరణ ప్రారంభించారు. జనవరిలో సుమారు 2 వేల మంది పూర్వ విద్యార్థుల సమక్షంలో పాఠశాల వజ్రోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఇందుకు గాను ఆర్గనైజింగ్ కమిటీ రెండవ సమావేశం 60 మందితో ఆదివారం పేరూరు ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. ఈ సమావేశంలో పలువురు ముఖ్య వక్తలు మాట్లాడుతూ పాఠశాల వజ్రోత్సవ వేడుకలను ఆగస్టు 15వ తేదీన ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15 నుండి జనవరి వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ, జనవరి నెలలో సుమారు 2 వేల మంది పూర్వ విద్యార్థులతో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు జిల్లాకు చెందిన పలువురు ప్రముఖ రాజకీయ,విద్యావేత్తలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి, తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొ॥ ఎమ్మెల్సీ కోదండరాంలను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఈ వజ్రోత్సవ వేడుకలతో పాఠశాల అభివృద్ధితోపాటు, విద్యార్థుల భవిష్యత్తు కార్యచరణ రూపొందించి మన బడిని మనం కాపాడుకుందాం అనే నినాదంతో ముందుకు సాగుదామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పూర్వ విద్యార్థులందరూ పూర్తి సహాయ సహకారాలు అందించి ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడ లేని విధంగా అందరికీ ఆదర్శవంతంగా ఈ వజ్రోత్సవ వేడుకలు ఘనంగా జరిపి విజయవంతం చేయాలని వారు కోరారు.

### ఉయ్యాలవాడ గురుకుల

## పాఠశాల ఘటనపై కఠిన చర్యలు

**జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలో ఉన్న మహాత్మా జ్యోతిబాఫూలే బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి భోజనం చేసిన అనంతరం విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రాథమిక విచారణ ఆధారంగా క్యాటరింగ్ కాంట్రాక్టును రద్దు చేస్తూ, డిప్యూటీ వార్డెన్‌పై శాఖాపరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. పాఠశాల సమర్థవంతమైన నిర్వహణ కోసం త్వరలోనే కొత్త ప్రిన్సిపల్‌ను నియమించనున్నట్లు వెల్లడించారు.విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడానికి అవసరమైన అన్ని చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టిందని కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



### చాకలి ఎస్సీ సాధనసమితి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అద్దని హరినాథ్ నియామకం

**మహబూబ్‌నగర్, జూలై27,ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన అద్దని హరినాథ్ చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. హరినాథ్ మహబూబ్నగర్ పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆదివారం హరినాథ్ మాట్లాడుతూ తనపైనమ్మకంతో రాష్ట్రఅధ్యక్షురాలు లక్ష్మి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియామకం చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. నా జాతి అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తానని తెలిపారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.




### రాష్ట్ర అధ్యక్షుడిని సన్మానించిన మండల అధ్యక్షులు

**శ్రీరంగాపూర్, జూలై 27 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర నూతన భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటిసారిగా ఎన్. రామ్‌చంద్రయ్య వనపర్తి జిల్లా పర్యటనకు రావడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరంగాపూర్ మండల అధ్యక్షులు నలవోతుల విష్ణువర్ధన్ నాయుడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అయిన ఎన్.చంద్రయ్యను కలిసి అభినందనలు తెలియజేసి శాలువాతో సన్మానించడం జరిగింది.

### వనపర్తి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి

**దేవరకద్ర, జూలై 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో పలు వివాహ కార్యాలయాల్లో వనపర్తి ఎమ్మెల్యే మేఘరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డిని జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. వనపర్తి ఫంక్షన్ హాల్లో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, కౌకుంట్ల గ్రామ నాయకులు జయన్న, చిన్న రావు తదితరులు పాల్గొన్నారు.

### శుభకార్యాల్లో పాల్గొన్న దేవరకద్ర, వనపర్తి ఎమ్మెల్యేలు



నిశ్చితార్థ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేలు

**దేవరకద్ర, జూలై 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాకు చెందిన శ్రీనివాస్ రావుకవిత దంపతుల కూతురు మోనిక నిశ్చితార్థ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా త్వరలో ఒకటి కాబోతున్న నూతన జంటను ఆశీర్వదించి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండలానికి చెందిన మాజీ సర్పంచ్ స్వప్న కిషన్ రావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**మహబూబ్ నగర్, జూలై 27,ప్రభాతవార్త :** గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం కోసం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆదివారం కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 100 మంది అభ్యర్థులకు గాను, 88 మంది హాజరయ్యారని, 12మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు 111 మంది అభ్యర్థులకు గాను 97 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు . లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే ప్లాటింగ్‌పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు తో పాటు ఎలాంటి కాపీ జరుగకుండా పరీక్ష ను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు..జిల్లా కలెక్టర్ తో పాటు డిపార్ట్మెంటల్ అధికారి,సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి.కిషన్ రావు,అర్.డి. ఓ నవీన్,అర్బన్ తహశీల్దార్ ఘన్షి రాం,తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పరిశీలన

**- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి చిన్నారెడ్డి సందర్శించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకొని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. విద్యార్థులకు ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌కు సూచించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు



విద్యార్థినులతో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

అధిక ప్రాధాన్యత ఇస్తూ, విద్యార్థుల వసతులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని డిఎంహెచ్వో స్వరాజ్యలక్ష్మికి ఆదేశించారు. అదే విధంగా పాఠశాలలో వంట చేస్తున్న వంట నిర్వాహకులతో మాట్లాడి నాణ్యత కూడిన భోజనాన్ని అందించాలన్నారు. ఈ సందర్శనలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, బీసీ గురుకుల పాఠశాలల కార్యదర్శి సైదులు, డిఎంహెచ్వో స్వరాజ్యలలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తు మా బాధ్యత

మొదటి పేజీ తరువాయి భాగం..

జరుగుతుందని ఇలాంటి పరిస్థితుల్లో బిసి వెల్ఫేర్ గురుకుల విద్యాసంస్థలో ఫుడ్ పాయిజన్ కావడం దురదృష్టకర మని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను వారిని పరామర్శించి కళాశాలను సందర్శించి అక్కడ పరిసరాలను సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సుమారు 68 మంది



కూరగాయాలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

విద్యార్థులకు అస్వస్థత కావడం జరిగిందని ఇందుకు బాధ్యులైన వారిపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. సంఘటన విషయం తెలిసిన వెంటనే ఇక్కడ ఉన్నత అధికారులను ఆదేశించడం జరిగిందని విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించడంతో వైద్యులు మరియు జిల్లా వైద్యాధికారి ఆసుపత్రి సూపరింటెండెంట్ సమన్వయంతో విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించడం వల్ల విద్యార్థులు త్వరగా కోలుకోవడం జరిగిందని వారి సేవలను అభినందిస్తున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో ప్రతినెల గురుకులాలను తనిఖీ చేస్తానని వంట ఏజెన్సీ లపై ప్రత్యేక నిఘాను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## భవిష్యత్తే లక్ష్యంగా పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

విద్యా తెలంగాణగా మారుస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతో కేవలం ఒక్క సంవత్సరంలోనే ఐఐఐటి కళాశాల, పాలమూరు యూనివర్సిటీ లో లా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, ఇప్పుడు జేకే ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సిజే బెనహర్ , మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, అజ్మత్ అలి, అవేజ్, గులాం జహీర్, షా ఫైసల్, అజిమ్, బాసిత్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మరియు జికె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మొదటి పేజీ తరువాయి భాగం..

34,088క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 31504క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 52,682 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,18,274 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.825అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 198.8120 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66,417క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

## ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఛైర్మన్‌గా జి హర్షవర్ధన్ రెడ్డి

**జడ్చర్ల, జూలై27,ప్రభాతవార్త:** జడ్చర్లలోని ఎస్వీకేయం పాఠశాలలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, తెలంగాణ పీడీ,పి ఈ టి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దూమర్ల నిరంజన్ హాజరై మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో హ్యాండ్ బాల్ క్రీడా అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామని అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో వివిధ నియోజకవర్గాల్లో హ్యాండ్ బాల్ కోచింగ్ క్యాంపు లను నిర్వహించి క్రీడను గ్రామ స్థాయి వరకు విస్తరించే విధంగా కృషి చేద్దామని, ఉమ్మడి జిల్లాలో హ్యాండ్ బాల్ క్రీడాకారులకు కుదువ లేదని ఎంతోమంది జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చారని అన్నారు. మండల స్థాయిలో హ్యాండ్ బాల్ క్రీడా క్లబ్బులు ఏర్పాటుచేసి గ్రామీణ యువకులను సైతం క్రీడల వైపు మళ్లించేలా చర్యలు తీలసుకోవాలన్నారు. అనంతరం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.

**ఉమ్మడి జిల్లా కమిటీ ఎన్నిక..**

ఉమ్మడి మహబూబ్‌గర్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఛైర్మన్ గా గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ తాకియుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా శంకర్ నాయక్, కోశాధికారిగా కాల్వ రామ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా సహాయ కార్యదర్శులుగా 25 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ నుండి చింతకాయల పుల్లయ్య జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ నుండి శరత్ చంద్ర అబ్జర్వర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తిరుమలయ్య వ్యవహరించారు.నల్గొండ జిల్లా అండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఉస్మాన్, మహబూబ్నగర్ జిల్లా పీడీ, పీఈటి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, కోశాధికారి మొగులాల్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా బాధ్యులు వెంకటేష్, షోయబ్ అలీ. మన్యం రాఘవేందర్ యాదయ్య రవి, ఉమా శంకర్ ప్రశాంత్, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

# అందాల భామలపై ఉన్న ప్రేమ... విద్యార్థులపై లేదు

మొదటి పేజీ తరువాయి భాగం..

కలిసి ఆదివారం పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ నీచ రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడరాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఆయన తీవ్రంగా విమర్శించారు. ఆత్మ విమర్శ చేసుకో రేవంత్ రెడ్డి. రాజకీయాలు ఉంటే ఎన్నికలప్పుడు చూసుకుందాం విద్యార్థుల జీవితాలతో వద్దని హితవు పలికారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ గురుకుల వ్యవస్థ విధానాన్ని బలోపేతం చేయకపోతే బీఆర్ఎస్ పార్టీ మళ్లీ గురుకులాల బాట పట్టవలసి వస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు. కేసీఆర్ ఆనవాళ్లు మార్చడం అంటే గురుకులాల పిల్లలను పొట్టన పెట్టుకోవడమా రేవంత్ రెడ్డి అని ఆయన ప్రశ్నించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ అన్నావు రెండు సంవత్సరాల్లో ఒక ఇటుక పెట్టింది లేదు ఒక టెండర్ పిలిచింది లేదని ఆయన తీవ్ర స్థాయిలో దుయబడ్డారు. ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రాష్ట్రంలో 284 గురుకులాలు ఉంటే మొత్తం 1040 గురుకులాలను ఏర్పాటు చేసి ఆరు లక్షల మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అలాంటి గురుకుల వ్యవస్థను కేసీఆర్ మీద కోపంతో రేవంత్ రెడ్డి నిర్వీర్యం చేస్తున్నారా అంటూ ప్రశ్నించారు. కోపం ఉంటే మాపై చూపాలి కానీ పేద విద్యార్థులపై విద్యావ్యవస్థ పై చూపరాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి వద్దే ఉన్న విద్యాశాఖ పనితీరు ఇంత అస్తవ్యస్తంగా ఉందంటే వారి పరిపాలన తీరు అర్థం అవుతుందని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే విద్యా వ్యవస్థ ఇంత అధ్వానంగా మారిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో రోజు ఏదో ఒక చోట విష ఆహారం



చికిత్స పొందుతున్న విద్యార్థినితో మాట్లాడుతున్న మాజీ మంత్రి

ఘటనలు గురుకులలు, వసతి గృహాల్లో వెలుగు చూస్తూనే ఉన్నాయని, జనగామలో మూడు రోజుల క్రితం పడుకున్న చోట విద్యార్థులకు పదిమందిని ఎలుకలు కొరకడం వంటి సంఘటనలు జరుగుతుండడం సిగ్గుచేటు అన్నారు. నాగర్‌కర్నూల్ లో బీసీ గురుకుల పాఠశాలలో 111 మంది విద్యార్థులు విషాహారం తిని ఆసుపత్రి పాలైతే కనీసం చీమకుట్టినట్టైనా లేదా రేవంత్ రెడ్డి అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్ లో తానే విద్యాశాఖ మంత్రిగా ఉండి ఇలాంటి సంఘటన జరగడం సిగ్గుచేటు అన్నారు. గురుకుల విద్యార్థుల వార్త టీవీలో పేపర్లో లేని రోజు లేదనీ విమర్శించారు. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోయి ప్రైవేట్ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. నీ రాజకీయాల కోసం విద్యార్థుల జీవితాలను నాశనం చేయవద్దని అన్నారు. మానవ హక్కుల కమిషన్, హైకోర్టు



డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మితో మాట్లాడుతున్న మాజీ మంత్రి

ప్రధాన న్యాయమూర్తులు రాష్ట్రంలో గురుకుల పాఠశాలలలో జరుగుతున్న ఘటనలపై వస్తున్న మీడియా కథనాలు క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలపై సుమోటోగా స్వీకరించి విద్యార్థులకు న్యాయం చేయాలని హరీష్ రావు కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందాల చర్యలు తీసుకోవాలని బీసీ హాస్టల్లో ఇంకా బెడ్ షీట్లు, కాస్మోటిక్ బిల్లులు, ట్రంకు పెట్టెలు అందించలేదని సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. శనివారం కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన కొన్ని గంటల్లోనే ఆదివారం ఉదయం వండిన సాంబారులో పురుగులు వచ్చాయని విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చినట్టు హరీష్ రావు పేర్కొన్నారు. వసతి గృహ ఆవరణలో డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి, వార్డెన్, వంట నిర్వాహకులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సగరుల అభివృద్ధికి ఎల్లవేళలా తోడ్పాటు : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జూలై 27 ప్రభాతవార్త:** సగరుల అభివృద్ధికి తాను ఎల్లవేళలా తోడ్పాటును అందిస్తానని వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ఇటీవల జరిగిన సగరుల జిల్లా కమిటీ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులకు వనపర్తి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన సన్మాన సభ కార్యక్రమానికి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా జిల్లా అధ్యక్షులు తిరుపతయ్య సాగర్‌తో పాటు కమిటీ సభ్యులను వారు పుష్పగుచ్ఛాలతో శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెగా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వనపర్తి నియోజకవర్గంలో సగరులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని జిల్లా గ్రంథాలయ అధ్యక్షునిగా గోవర్ధన సాగర్ గారినీ, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా చీర్ల చందర్, పలువురు కౌన్సిలర్లను, నాయకులకు సముచిత స్థానాలు కల్పించి గౌరవిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాటి దివంగత ముఖ్యమంత్రి వైయస్. రాజశేఖర్ రెడ్డి హయాంలో సగరులకు గౌరవం దక్కిందని, అలాగే నేడు తిరిగి ఆ గౌరవం సగరులందరూ పొందుతున్నారని ఎమ్మెల్యే అన్నారు.గడిచిన పదేళ్ల టిఆర్ఎస్ కాలంలో సగరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ గారు చేపట్టిన పాదయాత్రలో అన్ని కులాలకు సంబంధించిన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెగా రెడ్డి

ఇబ్బందులను నేరుగా చూశారని ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నేడు తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగనన ప్రాతిపదికన సగరులకు దక్కాల్సిన అన్ని రకాల పదవులు దక్కుతాయని ఆయన అన్నారు. వనపర్తి నియోజకవర్గం పరిధిలోని సగరుల సమస్యలను తాను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటు వనపర్తి మినీ ట్యాంక్ బండ్ నల్లచెరువు కట్టపై సగరుడి విగ్రహావిష్కరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణంలో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాల అందిస్తామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాల చైర్మన్ గోవర్ధన్ సాగర్ ,వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరవ సత్యం సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గొబ్బూరి చంద్రాయుడు సాగర్, జిల్లా కోశాధికారి గుంటి సత్యం సాగర్, రాష్ట్ర సగర సంగం గౌరవ అధ్యక్షులు ముత్యాల హరికృష్ణ సాగర్, రాష్ట్ర సగర సంగం ముఖ్య సలహాదారుడు ఆర్పి ఆంజనేయులు సాగర్, యాదాద్రి సగర సంగం అధ్యక్షులు కెపి రాములు సాగర్, యాదాద్రి సంఘం గౌరవ అధ్యక్షులు బంగారు నరసింహ సాగర్, సగర సంఘం మాజీ కార్పొరేటర్ దేవరకద్ర బాలన్న సాగర్, రాష్ట్ర సగర సంగం ఉపాధ్యక్షులు చిలుక సత్యం సాగర్, యాదాద్రి సంఘం ఉపాధ్యక్షులు పల్లె సత్యనారాయణ, రాష్ట్ర సగర సంఘం సముక్త కార్యదర్శి విష్ణు సాగర్, గ్రేటర్ హైదరాబాద్ సగర సంగం అధ్యక్షులు రవి సగర, గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రెటరీ ఆవుల వెంకట్ రాములు సగర, వనపర్తి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రావుల నాగరాజ సగర, జిల్లా ఉద్యోగుల సంఘం వేముల రాములు సగర, రాష్ట్ర శారదగా మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి సాగర్, వనపర్తి పట్టణ సాగర సంఘం అధ్యక్షులు చీర్ల గోవర్ధన్ సాగర్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్ సాగర్, వనపర్తి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చందర్ సాగర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చీర్ల సత్యం సాగర్, పాన్గల్ మండల్ టిఆర్ఎస్ అధ్యక్షులు వీరాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు మద్దతు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

### కాంగ్రెస్ పాలనపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మండిపాటు

**గద్వాలటౌన్, జూలై 27, ప్రభాతవార్త:** కాటన్ సీడ్ హబ్ గా వున్న నడిగడ్డ ప్రాంతంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందని, రాష్ట్రంలోని పత్తి రైతులకు మద్దతు ధర కల్పించడంలో రేవంతు ప్రభుత్వం విఫలమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్,రామచంద్రరావు మండిపడ్డారు . జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రం లోనీ ఆదివారం ఎస్వి ఇవేంట్ ఫంక్షన్ హాల్ నందు మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినదని, నమ్మి ఓటు వేసిన ప్రజలను నట్టేట ముంచిందనీ, ఇచ్చిన ఆరు గ్యారంటీలను నిరవేర్చలేక పోతుందని ఆరోపనలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ పై ఫైర్ అయ్యారు.తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడైన తర్వాత గద్వాల ప్రాంతానికి మొదటిసారి రావడం జరిగిందనీ, రాష్ట్రంలో పంచాయతీ రాజ్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బిజెపిపై లేనిపోని ఆరోపణలు చేస్తుందన్నారు. ఈ ప్రాంతంలో కాటన్ సీడ్ హాబ్ గా ఉందని పత్తి రైతులను విస్మరిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు కొరత సృష్టిస్తూ బిజెపిపై నిందలు మోపుతు కాలం వెళ్ళతీస్తుందన్నారు. అన్ని రాష్ట్రల్లో యూరియా నిల్వలు ఉండగా తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరత పేరున రాజకీయం చేస్తున్నారన్నారు.12 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా తెలంగాణ రాష్ట్రనీకి కేంద్రం ఇస్తే కృతిమ కొరత సృష్టిస్తున్నారు.12 లక్షలు మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు

నాగేశ్వర్ రావు రైతులకు ఎందుకు ఇవ్వలేకపోతున్నరన్నారనీ ప్రశ్నించారు. రాబోయే పంచాయతీ రాజ్ ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఇలాంటి జిమ్మిక్కులు చేస్తుందన్నారు. కాంగ్రేస్ పార్టీనీ నమ్మి ఓట్లు వేస్తె మీరు అదోగతి పాలవుతారనీ రాష్ట్ర ప్రజానీకానికి హెచ్చరించారు . బిజెపి పార్టీ ఎవ్వరితో పొత్తు ఉండదని ఒంటరిగానే పోటీలో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, భరత్ కుమార్, బండల వెంకట్రాములు, అప్సర్ పాషా, జయశ్రీ, రామచంద్ర రెడ్డి, స్నిగ్ధ రెడ్డి, శివా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మండల బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

### స్థానిక సంస్థల ఎన్నికలకు అందరు సిద్ధం కావాలి

### మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

**మక్తల్ టౌన్, జూలై 27 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు.పట్టణ కేంద్రంలోని ద్వారక ఫంక్షన్ హాల్‌లో బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జుట్ల చిన్న హనుమంతు,అధ్యక్షతన మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బిఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాలను



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

గ్రామస్థాయిలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ అబద్దాలను ప్రజలు వివరించాలని గ్రామస్థాయిలో బిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని అన్నారు.వచ్చే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, మునిసిపాలిటీ, జడ్పిటిసి ఎన్నికల్లో అందరూ సమిష్టిగా ఏకమై బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టెం సుచరిత, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి. నరసింహ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాజుల ఆశిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చిన్న హనుమంతు, మాజీ కౌన్సిలర్లు అన్వర్ హుస్సేన్, పసుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎరుకలి మొగులప్ప, మాగనూరు మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎల్లారెడ్డి. మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



హాజరైన టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

## ఐజేయూ వనపర్తి జనరల్ సెక్రెటరీకి సన్మానం



రాజును సన్మానిస్తున్న జర్నలిస్టులు

**మహబూబ్‌నగర్, జూలై27,ప్రభాతవార్త:** యూనియన్ వనపర్తి జనరల్ సెక్రెటరీ రాజును మహబూబ్‌నగర్ జర్నలిస్టులు సన్మానించారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం పలువురు జర్నలిస్టులు రాజును సన్మానించి బొకే అందజేశారు. నిస్వార్థంగా, నిజాయి తీగా ఉండే రాజులాంటి వారికి టీయూడబ్ల్యూజే ఐజేయూలో కీలక బాధ్యతలు అప్పజెప్పడం సంతోషించదగ్గ విషయమని ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్రకార్యదర్శికి మధుగౌడ్‌కు తోటి జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు. రాజు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.

## డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో నలుగురిపై కేసు నమోదు

**లింగాల, జూలై 27 ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలు నడిపితే అట్టి వారిపై కేసు నమోదు చేస్తామని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని అంబట్ పల్లి, యాపట్ల రోడ్డు మార్గంలో వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీ చేయగా మద్యం సేవించి ఉండడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం ఎస్సై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్సై తెలిపారు.

## అబ్దుల్ కలాంకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు

**మహబూబ్‌నగర్, జూలై27,ప్రభాతవార్త:** భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా దివంగత అబ్దుల్ కలాం ఆశయాలు నెరవేర్చాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఆర్వీఎం హాల్ మెట్టుగడ్డ వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు వినోద్, పద్మావతి, షంషేర్, సాయిబాబా, మంజులత, శరత్ కృష్ణ, ఆనంద్,శ్రీహరి, బషీర్ అహ్మద్, అరుణమ్మ, నేపాల్, తదితరులు పాల్గొన్నారు.